ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శనివారం 14 డిసెంబరు 2024



వైభవంగా నందమూరుగరువు ఆంజనేయ స్వామి ఉత్సవాలు

6

ఏకగ్రీవం.. ఏకపక్షం!

- నీటి సంఘాల ఎన్నికలలో కూటమి ఎత్తులు
- చేతులెత్తేసిన వైసీపీ.. పోటీకి దూరం
- నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

భీమవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలపై అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. పశ్చిమజిల్లా పరిధిలోని నీటి వినియోగదారులు సంఘాలు, నీటి పంపిణీ సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు నీటి సంఘాల ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఎన్నిక లాంచన ప్రాయం కానునున్నది. ఏకగ్రీవమయ్యే విధంగా సభ్యులు, ఛైర్మన్‌ల ఎన్నిక కూడా కానున్నాయి. ఆ దిశగా జిల్లాలోని కూటమి నేతలు ఇప్పటికే కసరత్తు చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులతో చర్చలు జరిపారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు సమావేశమై ఎన్నిక సజావుగా జరిగేలా చూడాలని అధిష్టానం నుంచి సంకేతాలు వచ్చాయి. నీటి సంఘాలపై ఆసక్తి చూపే నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే తమ మనోభావాలను స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల ముందుంచారు. ఆశీస్సులు తీసుకున్నారు. నీటి సంఘాల ఛైర్మన్‌లలో ఒకరిని నీటి వినియోగదారుల సంఘానికి ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. జిల్లా కలెక్టర్ ఇప్పటికే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. డివిజన్‌ల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నిక ప్రక్రియ పూర్తి చెయ్యాలని దిశా నిర్దేశం చేశారు.

చేతులెత్తేసిన వైసీపీ

నీటి సంఘాల ఎన్నికలపై తొలి నుంచి ఆసక్తి చూపని వైసీపీ తాజా ఎన్నికలలో ముందుగానే చేతులెత్తేసింది. ఎన్నికలకు దూరంగా ఉంటుంది. నీటి సంఘాలపై వైసీపీ నాయకులు దృష్టిసారించలేదు. వైసీపీ శ్రేణులు కూడా ఆసక్తి ప్రదర్శించలేదు. గడిచిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి భారం నుంచి ఇంకా తేరుకోలేదు. మరోవైపు ప్రతి నియోజకవర్గంలోనూ పార్టీ అంతర్గత విబేధాలతో ఇబ్బందులు పడుతున్నది. భీమవరంలో మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా, అక్కడ పార్టీపై ప్రభావం చూపింది. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణకు వ్యతిరేకంగా మరో బలమైన వర్గం ఎదురు తిరుగుతుంది. ఇలా నియోజకవర్గాలలోని సమస్యలపై నేతలు సతమతమవుతున్నారు. ఫలితంగా నీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించలేదు. ఓటమి తప్పదన్న భయం కూడా వారిని వెంటాడుతున్నది. ఇది కూటమికి కలిసివచ్చింది. నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షం కానున్నాయి.

సాగునీటి సంఘాలు ఇలా..

జిల్లాలో మేజర్ ఇరిగేషన్‌కు సంబంధించి 1176 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయి. 98 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. మైనర్ ఇరిగేషన్‌లో 84 ప్రాదేశిక నియోజకవర్గాలు, 14 నీటి సంఘాలు ఉన్నాయి. శనివారం వీటికి ఎన్నిక జరగనున్నది. ప్రాదేశిక నియోజకవర్గాల సభ్యులు నీటి వినియోగదారుల సంఘాలలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. అలాగే నీటి పంపిణీ సంఘాల (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)కు ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి.





నీటి సంఘాలతో ప్రయోజనాలెన్నో..

నీటి సంఘాలతో ప్రయోజనాలెన్నో ఉన్నాయి. పంట కాలువలు, డ్రెయిన్‌లు పర్యవేక్షణలో ఈ సంఘాల ప్రతినిధులు, ఛైర్మన్‌లు కీలక పాత్ర వహిస్తారు. సమస్యలు జలవనరులశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతారు. సమస్యలు గుర్తించి పనులు చేపట్టేలా, సూచనలు సలహాలు ఇస్తుంటారు. ప్రతిపాదనలు సిద్ధం చేసేలా అధికారులపై ఒత్తిడి తెస్తుంటారు. సొంత సొమ్ములు వెచ్చించి కాలువలు, పనులు చేసిన నీటి వినియోగదారులు ఛైర్మన్‌లు ఉన్నారు. ఇలా ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసి రైతులకు సక్రమంగా సాగు నీరు అందించడం, అధిక వర్షాలలో ముంపు నివారణకు చర్యలు తీసుకోవడంలో నీటి సంఘాలు కీలక పాత్ర వహిస్తుంటాయి. అందుకే కూటమి ప్రభుత్వం వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఎన్నికల ద్వారా ఛైర్మన్‌లు ఎన్నుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతులకు మేలు చేసే నీటి సంఘాల ఎన్నికలపై వైసీపీ ప్రభుత్వం పెద్దగా దృష్టి పెట్టలేదు. గడిచిన ఐదేళ్లలో నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించలేదు. పంటకాలువలు, డ్రెయిన్‌లను పూర్తిగా విస్మరించింది. నిధులు కేటాయించలేదు. ఫలితంగా నీటి ఎద్దడిలో శివారు ప్రాంతాలు బీటలు వారాయి. అధిక వర్షాలలో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. వైసీపీ హయాంలో ప్రతి ఏటా రైతులు తీవ్రంగా నష్టపోయారు. వేసవి పనులు చేపట్టలేదు. కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించలేదు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిలుపుదల చేసింది. వడ్డీల భారం పెరిగి ఆస్తులు అమ్ముకున్న కాంట్రాక్టర్లు ఉన్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోనికి రావడంతో రైతులలో మళ్లీ జోష్ నెలకొంది. ఈ ఏడాది అతివృష్టి వలన ముంపు తీవ్రత తగ్గించడంలోనూ కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దాదాపు ఎనిమిది కోట్ల రూపాయలతో వర్షాకాలంలోనే పూడిక, తూడు తొలగింపు పనులు చేపట్టారు. రానున్న వేసవిలో రూ.43కోట్లతో వేసవి పనులు చేపట్టేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రచించారు. సదరు పనులు సక్రమంగా నిర్వహించాలంటే నీటి సంఘాలు కీలకం కానున్నాయి. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించాలన్నా నీటి సంఘాల అనుమతులు తప్పనిసరి. పనులలో జవాబుదారీ తనం, నీటి సరఫరాలో పర్యవేక్షణ ఉండాలంటే నీటి సంఘాల ఆవశ్యకత ఉంది. కూటమి ప్రభుత్వం అందుకే నీటి సంఘాలను మళ్లీ తెరపైకి తెచ్చింది. అందుకోసం ఎన్నికలు నిర్వహిస్తున్నది.

తొలి రోజు 1,658 ఫిర్యాదులు

రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలి: కలెక్టర్



భీమవరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జిల్లాలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో ఈ నెల 13 నుంచి వచ్చేనెల8 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో తొలి రోజున 24 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా 1,658 అర్జీలను స్వీకరించడం జరిగిందని తెలిపారు. ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 50 శాతం అర్జీలు భూ వివాదాలు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులే ఉంటున్నాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు: జేసీ

పాలకొల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికే గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. పాలకొల్లు రూరల్ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో జేసీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈసదస్సులో రెవెన్యూ రికార్డులకు సంబంధించిన 19 దరఖాస్తులను జేసీ స్వీకరించారు ఈసందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులపై ఆయా శాఖల అధికారులు పరిశీలించి, నిర్దేశించిన గడువులోపుగా పరిష్కరించాలని తహసీల్దార్, మండల సర్వేయర్లను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై 33 రోజుల్లో పరిష్కారం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దుర్గా కిషోర్, సర్వేయర్ శైలజ పాల్గొన్నారు.

నరసాపురం కంపోస్ట్ యార్డుపై నేషనల్ ట్రిబ్యునల్ విచారణ

7

నారుమడులకు వాతావరణ గండం

- అల్పపీడనం ప్రభావంతో నిలిచిన నారుమళ్ల ప్రక్రియ
- జిల్లాలో 300 ఎకరాల్లో మాత్రమే పూర్తయిన నారుమడులు



భీమవరంలో దాళ్వా నారుమడి నీరు బయటకు తోడుతున్న రైతు

భీమవరం రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి) : దాళ్వా సాగు అనుకున్న సమయంలో సాగించాలి, దిగుబడులు బాగా సాధించాలనే రైతుల ముందస్తు నారుమడులు వేసే ప్రక్రియకు అల్పపీడన ప్రభావం గడిగడి గండంగా మారింది. గడిచిన వారంలో జిల్లాలో 300 ఎకరాల వరకు నారుమడులు వేశారు. రెండు రోజులుగా వాతావరణ మార్పుతో నారుమడులకు ఇబ్బందిగా మారింది. దానికి తోడు ఈ నెల 15వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపడం రైతులకు నారుమడులు కాపాడుకోవడం అవస్థగా మారింది. దానికి తోడు మిగిలిన నారుమడుల ప్రక్రియకు కూడా వాతావరణ మార్పు అడ్డుకట్టగా నిలిచింది. ఈ నెల 20వ తేదీ లోపు పూర్తి స్థాయిలో నారుమడులు వేయాలన్నది అటు అధికారులు, ఇటు రైతుల ఆలోచన. జిల్లాలో దాళ్వా సాగు 2 లక్షల 25 వేల ఎకరాల్లో సాగనుంది. లెక్క ప్రకారం 10 వేల ఎకరాల వరకు నారుమడులు వెయ్యాలి. ఇప్పటికి 300 ఎకరాల్లో మాత్రమే నారుమడులు వేశారు. పది శాతం నారుమడులు కూడా వేయలేదు. చాలా ప్రాంతాల్లో నారుమడులు వేయడానికి మడులు సిద్ధం చేసుకుంటున్నారు. అయితే వాతావరణం మార్పు ఉంటుందని విత్తనాలు నానబెట్టడం వంటి పనులు నిలిపివేశారు. అలా నిలిచిపోయిన నారుమడులు 3 వేల ఎకరాలు పైనే ఉంటాయని రైతులు చెబుతున్నారు. దీంతో నారుమడులు వేయడం మరింత ఆలస్యమవుతుందని రైతులు కంగారు పడుతున్నారు. లెక్క ప్రకారం ఈ నెల 15 లోగా నారుమడులు పూర్తి చేసి వచ్చే నెల 10వ తేదీలోగా నాట్లు పూర్తి చేయాలని రైతులు అంచనా వేస్తున్నారు. అది మారటం వల్ల నాట్లు ప్రక్రియ వచ్చే నెల 20 వరకు సాగే అవకాశం ఉంది.

విత్తన రకం మార్చాలి

సార్వా పంట మాసూళ్ళ త్వరితగతిన పూర్తి చేసి దాళ్వా నారుమడులు ఈ నెల 15 లోగా వేయాలని రైతులకు పది రోజుల క్రితం తుఫాన్ ప్రభావం ఇప్పుడు అల్పపీడన ప్రభావం సార్వా పంట మాసూళ్ళ ఆలస్యంగా సాగడానికి దారి తీసింది. ఇంకా సార్వా పంట 40 వేల ఎకరాల వరకు మాసూళ్ళ జరగాల్సి ఉంది. దీంతో దాళ్వా సాగుకు మొన్నటి వరకు 11-21 రకం విత్తనాన్ని ఎంచుకున్న చాలా మంది రైతులు తక్కువ రోజులలో పంటకు వచ్చే ఐఆర్ 126 రకాన్ని, 1153 రకాన్ని వేయడానికి నిర్ణయించుకున్నారు. దీంతో చాలా వరకు సాగు ఈ రెండు రకాలు సాగనున్నాయి.

వాతావరణం అడ్డంకి

రామాంజనేయులు, రైతు, గునుపూడి

అధిక వర్షాల వల్ల సార్వా సాగు దెబ్బతింది. నాలుగు ఎకరాలు సాగు చేస్తే రూ.40 వేలు నష్టం వచ్చింది. ఇప్పుడు దాళ్వా నారుమడికి వాతావరణం అనుకూలించడం లేదు. విత్తనాలు చల్లినప్పటి నుంచి వాతావరణం మారిపోవడంతో దానిని రక్షించేందుకు అవస్థలు పడాలి. చిన్నపాటి వర్షమే పడుతుంది. అధికంగా కురిస్తే నారుమడి దెబ్బతింటుంది.



సంక్రాంతికి ఆర్టీసీ స్పెషల్స్

- అదనపు చార్జీల భారం లేదు
- హైదరాబాద్ నుంచి జిల్లాకు 113 సర్వీసులు
- జనవరి 9నుంచి 13వరకు 4 డిపోల నుంచి బస్సులు
- జనవరి 15 నుంచి 20 వరకు హైదరాబాద్‌కు 79 ప్రత్యేక సర్వీసులు

భీమవరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సీజన్ ద్వారా ఆర్టీసీ హైదరాబాద్ నుంచి జిల్లాకు ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే అన్ని రెగ్యులర్ సర్వీసులకు టికెట్లు బుక్ అవ్వటంతో అప్రమత్తమైన అధికారులు ప్రత్యేక సర్వీసులను నడిపేలా కార్యాచరణ సిద్ధం చేశారు. చార్జీల పెంపులేకుండా రెగ్యులర్ చార్జీలతో సర్వీసులను నడుపుతున్నారు. సంక్రాంతికి సంబంధించి వచ్చేనెల 9 వ తేదీ నుంచి 13 వరకు 113 సర్వీసులు నడపాలని నిర్ణయించారు. డిపోల వారీగా లక్ష్యాలను నిర్ధారించి సంబంధిత డిపో మేనేజర్లకు సమాచారం అందించారు. 10వ తేదీన ముక్కోటి, 11న రెండో శనివారం, 12 ఆదివారం 13వ తేదీ సోమవారం భోగి 14న మంగళవారం సంక్రాంతి, 15న బుధవారం కనుమ రావటంతో వరసగా సెలవులు వచ్చిన నేపథ్యంలో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. దానికి అనుగుణంగా సర్వీసులను ఏర్పాటుచేస్తున్నారు.

జనవరి 15 నుంచి 20 వరకు హైదరాబాద్‌కు..

సంక్రాంతి పండుగ తరువాత జిల్లా నుంచి హైదరాబాద్‌కు వెళ్ళే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేశారు. రెగ్యులర్ సర్వీసులతో పాటు 79 ప్రత్యేక సర్వీసులు నడపాలని నిర్ణయించారు. డిపోల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అవసరమైతే మరిన్ని సర్వీసులు నడిపేలా ఆలోచన చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రత్యేక సర్వీసులను ఆన్‌లైన్‌లో ఉంచారు. ఒక బస్సు రిజర్వేషన్ పూర్తయిన వెంటనే మరో సర్వీసును ఆన్‌లైన్‌లో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

విశాఖపట్నం సర్వీసులపై దృష్టి

ప్రజారవాణాధికారి ప్రసాద్

హైదరాబాద్‌తోపాటు సంక్రాంతి రద్దీ విశాఖపట్నం వైపు కూడా స్పందనపై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు జిల్లా ప్రజారవాణాధికారి ప్రసాద్ తెలిపారు. అవసరమైతే విశాఖపట్నంకు ప్రత్యేక సర్వీసులను నడుపుతామని ఆయన తెలిపారు. ఇందు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎంలను ఆదేశించామన్నారు. సంక్రాంతి సీజన్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచుకునేలా ఆలోచన చేస్తున్నామన్నారు.

పదవి దక్కేనా..!

- ఏఎంసీలకు పాలకవర్గాలు
- త్వరలో జిల్లాలో పది కమిటీల ఏర్పాటు
- కూటమి నేతల్లో ఛైర్మన్ పదవులపై ఆశలు

భీమవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి క్యాడర్‌కు ప్రభుత్వ నిర్ణయం జోష్ నింపింది. జిల్లాలో ఉన్న పది ఏఎంసీలకు కమిటీలను నియమించనున్నారు. భీమవరం, ఆకివీడు, ఉండి, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, పెనుగొండ, ఆచంట,నరసాపురం ఏఎంసీలకు ఛైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్లను నియమిస్తారు. వాస్తవానికి ఎమ్మెల్యే సిఫార్సులకే ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. స్థానిక ఏఎంసీల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్ళనున్నాయి. ప్రభుత్వ అనుమతితో కమిటీల నియామకంపై ఉత్తర్వులు జారీ కానున్నాయి. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 50శాతం రిజర్వేషన్‌లను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కల్పించింది. ఛైర్మన్ పదవులపై రిజర్వేషన్‌లను జిల్లా కలెక్టర్ నిర్ధారిస్తారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల నియామకంలో ఇప్పటికే జాప్యం జరిగిందని కూటమి నేతల్లో అసంతృప్తి నెలకొన్నది. ప్రతి కమిటీ ఏడాది కాలానికి నియమిస్తుంది. తదుపరి ఆరునెలలకు ఒకసారి గరిష్టంగా రెండు పర్యాయాలు అదే కమిటీకి బాధ్యతలు అప్పగిస్తూ గడువు పొడిగిస్తోంది. లేదంటే ఏడాది తరువాత కొత్త కమిటీలకు ప్రాధాన్యత ఇస్తోంది.

ఏ పార్టీకి ఏ కమిటీ

రిజర్వేషన్‌లపై జిల్లా కలెక్టర్ నిర్ణయం తీసుకున్నా సరే కూటమిలో సర్దుబాటు కావలసి ఉంది. ఇప్పటి దాకా ప్రభుత్వం నియమించిన నామినేటడ్ పదవుల్లో 80 శాతం టీడీపీకి కేటాయించారు. మిగిలిన 20 శాతం కూటమిలో భాగస్వాములైన జనసేన, బీజేపీలకు పదవులను ఇస్తూ భర్తీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లోను అదే విధమైన నిష్పత్తిలో పదవులు కేటాయించే అవకాశం ఉందంటూ కూటమిలో చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలల్లో పశ్చిమలో జనసేనకు మూడు స్థానాలు కేటాయించారు. 4 స్థానాల్లో టీడీపీ పోటీ చేసింది. ఫలితంగా జిల్లాలోని భర్తీచేసే నామినేటడ్ పదవుల్లో వంతులు పంపకం ఎలా ఉంటుందనే దానిపై తర్జన భర్జనలు పడుతున్నారు. ప్రభుత్వ కూటమి పెద్దలే నిర్ణయం తీసుకుని కమిటీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్నారు. ఒక దశలో ఎమ్మెల్యేలకు కమిటీల భర్తీకోసం ప్రభుత్వం దిశా నిర్దేశం చేసింది. అయితే ఇతర భాగస్వామ్య పక్షాలు ఆశలు పెంచుకున్నారు. నామినేటడ్ పదవుల్లో తమ నియోజకవర్గాలకు అన్యాయం జరిగిందంటూ ఒకింత అసంతృప్తితో ఉన్నారు. ఇతర నామినేటడ్ పదవుల్లోనైనా న్యాయం జరుగుతుందని నియోజకవర్గ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కమిటీల రిజర్వేషన్ నిర్ధారణ నుంచి కమిటీ ఛైర్మన్‌ల రిజర్వేషన్ నిర్ధారణ నుంచి పార్టీల పంపకం దాకా కూటమి నాయకుల్లో తీవ్ర చర్చసాగుతోంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.



ఏఎంసీ ఆశావహులు డీలా

నరసాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇప్పటికే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల్లో స్థానం దక్కలేదు, కనీసం మార్కెట్ యార్డు పదవితోనైనా సరిపెట్టుకుందాని కలలు కంటున్న జిల్లాలోని కూటమి పార్టీల్లోని సీనియర్ నాయకుల ఆశలు రివర్స్ అయ్యాయి. త్వరలో భర్తీ చేసే ఈపదవుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్వోఆర్) అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 50శాతం ఛైర్మన్, డైరెక్టర్ పదవులు ఎస్సీ, బీసీ, ఎస్టీలకు కేటాయించనున్నారు. దీంతో పాటు మహిళలకు కూడా పదవుల భర్తీలో ప్రాధాన్యత కల్పించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో 50శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తూ 2019లో ప్రభుత్వం జీవో 77 జారీ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దీన్నే అమలు చేయాలని నిర్ణయించింది. జిల్లాను ఒక యూనిట్‌గా తీసుకుని రిజర్వేషన్‌ను అమలు చేయనున్నారు. బీసీ, మైనార్టీలకు 29శాతం, ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 6శాతం చొప్పున ఛైర్మన్ పదవులు కట్టబెట్టనున్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానానే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయడంతో ఇప్పటి వరకు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న సీనియర్ నేతలు డీలా పడ్డారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులు దక్కిని చాలా మంది ఆశావహులు కనీసం ఏఎంసీ ఛైర్మన్ పదవినైనా కట్టబెట్టాలని ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేస్తూ వచ్చారు. దీంతో ప్రతి నియోజకవర్గంలో ఇద్దరి ముగ్గురు పేర్లు ఈపదవికి షికారు చేశాయి. అయితే రిజర్వేషన్‌ను అమల్లోకి తీసుకురావడంతో ఏ సామాజిక వర్గానికి రిజర్వ్ అవుతుందన్న భయం ఆశావహుల్లో నెలకొంది.





శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం..

వైభవంగా నందమూరుగరువు ఆంజనేయుడి గ్రామోత్సవం

వీరవాసరం (భీమవరం టౌన్) డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం నందమూరుగురువులో శ్రీరామ భక్త ఆంజనేయస్వామి వారి 59 వార్షికోత్సవ హనుమద్వ్రత మహోత్సవాలు శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5-45 నిమిషాలకు కొప్పినీడి శ్రీనివాసరావు, లక్ష్మీ కృష్ణకుమారి దంపతులచే కలశస్థాపనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వామివారి గ్రామోత్సవం ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సీతారామ చ్రందస్వామి ఉత్సవ మూర్తులను ఉంచిన అనంతరం బాణసంచా కాల్పులతో, మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం ప్రారంభమైంది. రామభక్త హనుమాన్‌లు, మహారాష్ట్ర కళాకారులు మహిళా ట్రూపు డప్పులు, కోయ డ్యాన్సులు, బుట్టబొమ్మలు, ఇలా వివిధ కళారూపాలతో ఊరేగింపు సాగింది. రాత్రి ఆలయం వద్ద భారీ బాణసంచా కాల్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 13 రోజులు పాటు ఉత్సవాలు జరుగుతాయి. 25న అన్న సమారాధనతో ముగుస్తాయి.





ఊరేగింపులో వివిధ రాష్ట్రాల కళా ప్రదర్శనలు



విచిత్ర వేషధారణలు









జంగారెడ్డిగూడెం భక్తాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

ఘనంగా హనుమద్ వ్రతాలు

జంగారెడ్డిగూడెం/ద్వారకాతిరుమల డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి : మండలంలోని గురవాయిగూడెం మద్ది అంజనేయస్వామి క్షేత్రంలో శుక్రవారం మనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించినట్టు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని గంగానమ్మ ఆలయం వెనుక ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మనుమద్ వ్రతం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయం వద్ద జరిగిన ప్రత్యేక పూజల్లో ఇరవై మంది దంపతులు పాల్గొన్నారు. ఇంది రానగర్ కాలనీ వద్ద ఉన్న శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కమిటీ అధ్య క్షుడు వలవల తాతాజీ, సుశీల దంపతుల ఆధ్వర్యంలో మనుమద్‌వ్రతం నిర్వ హించారు. స్వామివారికి తమలపాకుల పూజ నిర్వహించారు.



తమలపాకులపై శ్రీరామ అని రాస్తున్న వేద పాఠశాల విద్యార్థులు

ద్వారకాతిరుమలలో...

ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన అంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. అర్చకులు, పండితులు స్వామివారిని విశేష పుష్పాలంకారాలు చేశారు. పంచామృతస్నపన, సహస్ర నాగావళి పూజలు నిర్వహించారు. ఆగమ విద్యార్థులు పాల్గొని ప్రతీ తమలపాకుపై శ్రీరామ అని రాసి అర్చకులకు అందజేయగా వాటితో అంజనేయునికి ప్రత్యేక పూజలు చేశారు.

నేత్రపర్వం .. శ్రీవారి తిరువీధి సేవ



ద్వారకాతిరుమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చినవెంకన్నకు శుక్రవారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన తిరువీధిసేవ భక్తు లను అలరించింది. కృత్తికా నక్షత్రం పురస్క రించుకుని ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు. ప్రతీఇంటి ముందు భక్తులు స్వామివారి, అమ్మవార్ల మూర్తులకు హారతులు పట్టారు.



నాట్య సమ్మోహనం.. అలరించిన నృత్య పోటీలు

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అద్భుత నృత్య సమ్మోహనంతో ప్రాంగణం పులకించింది. అభినయ నృత్య భారతి వార్షికోత్సవం సందర్భంగా ఏలూరు సెల నాగ కోటేశ్వరరావు కల్యాణ మండపంలో 29వ వార్షికోత్సవం పురస్కరించుకుని జాతీయ స్థాయి, కూచిపూడి, జానపద బృంద నృత్య పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కూచిపూడి, భరతనాట్యం, కదక్, ఒడిస్సీ నృత్యాలు విశేషంగా అలరించాయి. ఉదయం జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కళాకారులు తమ నాట్య ప్రదర్శనతో ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశారు. నాట్యంలో విశేష సేవలు అందించిన వారికి నృత్య తపస్వి, సేవా తపస్వి అవార్డులు నృత్య కౌముది అవార్డులను ప్రదానం చేశారు. పోటీ లను నంది అవార్డు గ్రహీత కేవీ సత్యనారా యణ, గోశాల రాష్ట్రకార్యదర్శి ఎం.మురళీకృష్ణ, విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ఆలపాటి నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, దివ్వి రామారావు పాల్గొన్నారు. మూడురోజుల పాటు పోటీలు జరగనున్నాయి. నాట్యాచార్య దివ్వి హేమసుందర్ పర్యవేక్షించారు.



రైతులు దాళ్వా నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. ఓవైపు సార్వా పనులు సాగుతుండగానే మరోవైపు రైతులు దాళ్వా పనుల్లో నిమగ్నమైపోయారు. ఈ ఏడాది సార్వా సాగు ఒడిదుడుకుల మధ్య సాగింది. వాటి నుంచి తేరుకోకముందే రైతులు దాళ్వాకు సన్నద్ధమయ్యారు. పాలకోడేరు మండలంలో ఇప్పటికే చాలాచోట్ల నారుమడులు నారుమడులు వేశారు. - **పాలకోడేరు**

ఇంధనం ఆదా చేద్దాం..



పెరిగిన వాహనాలు

పెట్రోల్, డీజిల్‌పైనే ఆధారం

విద్యుత్ వినియోగంలోనూ తగ్గేదేలే..

ఇంధన పొదుపుతోనే పర్యావరణానికి మేలు

నేడు జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం

ఆకివీడు రూరల్ /ఏలూరు కార్పొరేషన్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఇంధనాన్ని పొదుపుగా వినియోగించు కోవాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబర్ 14వ జాతీయ ఇంధన దినోత్సవం నిర్వస్తున్నారు. గత దశాబ్దంతో పోలిస్తే ఇంధన వినియోగం రెట్టింపు అయ్యిందని శాస్త్రవేత్తలు, పర్యావరణ వేత్తలు తెలియచేస్తున్నారు. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ వినియోగం ఎక్కువైంది. 2030 నాటికి మరింత పెరిగే అవకాశం ఉంది. నానాటికి వాహనాల సంఖ్య పెరుగుతుంది. ఇంధన వనరుల వినియోగం తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు ఇబ్బందులు తప్పవని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.



బతకడానికి ఇంధనం చాలా అవసరం. ఇంధనం లేకుండా జీవితమే లేదంటే అతిశయోక్తి లేదు. కాలుతీసి కాలు బయట పెట్టాలంటే ఇంధనం లేనిదే అవదు.ప్రస్తుత సమాజం ఇంధనంపై అంతలా ఆధారపడి ఉంది. ప్రధానంగా విద్యుత్, పెట్రోలు, గ్యాస్ ప్రజలకు అత్యవసరమైన ఇంధనాలు. వినియోగం పెరిగిపోయి, ఉత్పత్తులు తగ్గిపోతున్న వేళ ఉన్న వాటిని ఏవిధంగా పొదుపుగా సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్ తరాలకు ఇంధనం కొరత రాకుండా ఉంటుందో ఆలోచించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉంది. ఈ మూడు జీవనంలో భాగస్వాములయ్యాయి. అవి లేకుండా రోజు గడవని పరిస్థితి. విద్యుత్ ప్రతి ఒక్కరికి అత్యంత అవసరమైన ఇంధనం. నీరు, బొగ్గు, సూర్యరశ్మి నుంచి విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. అయితే ఉత్పత్తి తక్కువగా ఉండి, వినియోగం ఎక్కువగా ఉండటంతో అధిక ధరలు పలుకుతున్నాయి. సోలార్ విద్యుత్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలగలేదు. ప్రస్తుతం విద్యుత్‌ను ఆదా చేస్తే ఉత్పత్తి చేసిన ట్లేనని నిపుణులు తెలియజేస్తున్నారు. విద్యుత్‌ను ఉపయోగించుకుని బిల్లులు అధికంగా రాకుండా, భావి తరాలకు విద్యుత్ కొరత రాకుండా తగిన చర్యలు చేపట్టాలి.

ప్రమాణాలు పాటిస్తే ఇంధనం ఆదా



వాహనాలను నడిపే సమయంలో ఆయా వాహనాలు మ్యాన్యువల్‌ను తప్పనిసరిగా పాటించాలి. వాహనాలు నడిపే సమయంలో క్లచ్ తప్పనిసరి అయితే తప్ప ఉపయోగించకూడదు. వేగంగా నడపకూడదు, వేగంగా నడ పడం ఒక్కసారిగా వేగం తగ్గించడం, వంటివి చెయ్యకూడదు. గేర్‌లు ఉపయో గించే పద్ధతిలో వేగాన్ని బట్టి చెయ్యాలి. పరిమితిని మించి వాహనాలపై వెళ్లినా మైలేజీ రాదు. వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయిస్తుండాలి. ప్రణాళిక ప్రకారమే ప్రయాణాలను నిర్ణయించుకోవాలి. ప్రయాణంలో మ్యాప్‌లను ఉపయోగించి సక్రమంగా ఉన్న రహదారులపై ప్రయాణించాలి. ఆయా పరిస్థితులకనుగుణంగా జాగ్రత్తలు పాటిస్తూ ఇంధనా లను పొదుపు చేసి భావి తరాలకు ఇంధనాల కొరత రాకుండా బాధ్యతగా వ్యవహరించాలి.

-మోటుపల్లి రాజు, మెకానిక్

జాగ్రత్తలు తీసుకుంటే గ్యాస్ ఆదా



గ్యాస్ వినియోగంలో ఎక్కువగా చిన్న బర్నర్‌లను ఉపయోగించాలి. గ్యాస్ పొయ్యికి గాలి తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వంట చెయ్యడానికి ముందుగానే అన్ని వస్తువులు దగ్గర ఉంచుకోవాలి. కుక్కర్లను వినియోగించడం ద్వారా గ్యాస్ ఆదా అవుతుంది. మందం తక్కువగా ఉన్న పాత్రలను ఉపయోగించుకోవాలి. గ్యాస్ స్టవ్‌కు ఉపయోగించుకునే రబ్బర్ ట్యూబ్ సమయానికి మార్చుకోవాలి. బర్నర్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. లైటర్ లేదా అగ్గిపుల్ల వెలిగించిన తరువాతే బర్నర్‌ను ఆన్ చేసుకోవాలి.

- జ్యోతి, గృహిణి, సిద్ధాపురం

అనవసర వినియోగాన్ని తగ్గించాలి



వ్యాపార సముదాయాలు, గృహ వసరాలలో ముందుగా అనవసర వినియోగాన్ని గుర్తించాలి. ప్రధానం ఏసీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు గ్రీజర్‌లు, ఓవెన్స్ వంటి వాటిని ఉపయోగించేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి. ఏసీ లేని నివాసాలు లేవు. ఏసీలను ఆన్ చేసే సమయంలో టెంపరేచర్ కొంతమంది 16లో పెడతారు, దీని వల్ల ఏసీ ఎక్కువగా వస్తుందని అనుకుంటారు, దీని వలన విద్యుత్ వినియోగం ఎక్కువగా అవుతుందే తప్ప ఉపయోగ ముండదు. 24లో ఉంచి ఉపయోగిస్తే ఏసీ మీద భారం పడదు. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండదు. గది కూడా త్వరగా కూల్ అయ్యే అవకాశం ఉంటుంది. ఫ్రిజ్‌లు కూడా ఫ్రిజ్‌లో పెట్టకూడదు. ఫ్రిజ్ డోర్‌లు అస్తమాను తీస్తు వేస్తూ ఉండకూడదు. తక్కువ విద్యుత్ వినియోగమయ్యే ఎల్ఈడీ బల్బులనే వాడాలి, ఫ్యాన్‌లను రెగ్యులేటర్లతో ఉపయోగించుకోవాలి. గ్రీజర్ల విని యోగంలో కూడా సమయాన్ని ఉపయోగించుకోవాలి. అలంకరణ లైట్లు వినియోగం తగ్గించాలి.ఎప్పటికప్పుడు స్విచ్‌లు కట్టివేసి ఉంచాలి.

- ప్రదీప్, ఏఈ, విద్యుత్ శాఖ



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న బి.గోపాల్

ఉద్యాన ఉపకులపతి గోపాల్‌కు జీవిత సాఫల్య పురస్కారం

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ బి.గోపా ల్‌కు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యా లయం జీవిత సాఫల్య పురస్కారం అందించారు. హైద్రాబాద్‌లోని రాజేంద్రనగర్ వర్శి టీలో గురువారం ఇండియన్ ఫైటో పాథాలజీ, ఇన్నొవేటివ్ అప్రోచెస్ ఇన్‌ప్లాంట్ డిసిజ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఈ అవార్డు అందించారు. తీపి నారింజ, పులుపు నిమ్మ, ఉల్లి, పసుపు వంటి సుగంధ ద్రవ్యాల రూపకల్పనలో ప్రతిభ కనబరిచినందుకు ఈ పురస్కారం అందించారు.



రథాలను ప్రారంభిస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి సత్య రవికుమార్

హైందవ శంఖారావం ప్రచార రథాలు ప్రారంభం

ఏలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హిందు దేవాలయాల స్వయంప్రతిపత్తి కోరుతూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5న గన్నవరంలో నిర్వహించనున్న బారీ బహిరంగ సభలో ప్రతిఒక్క హిందువు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి తణికెళ్ళ సత్యరవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు పాత బస్టాండు సెంటర్లోని పాండురంగస్వామి ఆలయం వద్ద హైందవ శంఖారావం సభకు సంబంధించి ప్రజల్లో చైతన్యం కోసం ప్రచారానికి గారపాటి సీతారామాంజనేయ చౌదరి ఏర్పాటుచేసిన రెండు ప్రచార రథాలను రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 25 లక్షల కుటుంబాలను నేరుగా కలవడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.



చిన్నారుల భవితకు బాసట

దివ్యాంగులకు ఆసరాగా భవిత కేంద్రాలు

విద్యతో పాటు ఫిజియోథెరపీ



కైకలూరు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల కల్గిన పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. దీంతో వివిధ రకాల వైకల్యాలు ఉన్న చిన్నారులు పలు సేవలకు దూరమయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం ఫిజియోథెరపీ సేవలు పునరుద్ధరించడంతో పాటు వివిధ అంశాలపై దృష్టి సారించి చిన్నారుల భవితకు బాటలు వేస్తోంది. కైకలూరుభవిత కేంద్రంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక అవసరాలు కల్గినవారు సుమారు 22 మంది పిల్లలున్నారు. వీరికి విద్యను అందించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో ఫిజియోథెరపి సేవలు అందుతున్నాయి. భవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను, పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేరువేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు రూ.2 వేలు, అలవెన్సు, రీడర్ అలవెన్స్, హెచ్‌పీ అలవెన్స్, స్పీచ్ థెరపి, కళ్లజోళ్ల ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతేకాకుండా బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి బాహ్య స్క్రీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక దివ్యాంగులు అయినప్పటకీ వారిలో చదవడం, రాయడం, సంఖ్యలు గుర్తింపు, లెక్కింపు, డబ్బులు లెక్కింపు, నిత్య జీవితంలో అవసరమైన పనులు, స్వతహాగా చేసుకోవడం, సమాజాన్ని అర్థం చేసుకుని పరిస్థితులకు అనుగుణంగా స్పందించడం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి విద్యార్థి తన పేరు, చిరునామా, ఇంగ్లీషులో సంతకాలు చేసి మేము సైతం అన్నట్లుగా తీర్చిదిద్దడం తమే లక్ష్యమని అక్కడి బోధకులు వివరిస్తున్నారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు తమ కేంద్రం నుంచి నలుగురు విద్యార్థులు క్రైబ్ సహకారంతో హాజరయ్యేలా సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైకల్య సమస్య అతీతంగా ఉండి భవితకేంద్రం వరకు రాలేని పిల్లలుకు ఇంటికి వెళ్లి విద్యను అందించడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. వీరికి ఆఫ్ బేస్డ్ అలవెన్సు రూ.3 వేలు అదనంగా అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రతీ ఒక్క ప్రత్యేక అవసరాలు కల్గిన పిల్లలకు ఈ సొమ్ములను వారి సొంత కాతాల్లో జమ చేయడం జరుగుతుంది.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో

ప్రసవానికి లంచం డిమాండ్

ఉద్యోగులు సొమ్ము వసూలు చేస్తుండగా వీడియో తీసిన మహిళ

ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో ఆస్పత్రిలో విచారణ



ఆస్పత్రిలో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో కొద్ది రోజుల క్రితం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి రెండు గంటల పాటు పరిశీలించారు. అవినీతి జరిగితే సహించేది లేదని హెచ్చరికలు జారీ చేశారు. అయినా ఆసుపత్రి మాతా శిశు విభాగం ఉద్యోగుల తీరు మారలేదు. వారికి లంచం ఇవ్వనిదే ఏ పని జరగదని ప్రచారం కూడా ఉంది.

ఒక మహిళ ప్రసవానికి ఆస్పత్రికి వెళితే ఆమె బంధువుల వద్ద నుంచి అడుగడుగునా ఆసుపత్రి ఉద్యోగులు లంచం వసూలు చేశారని ఆ మహిళ ఆరోపించింది. ఒక వీడియో తీసి ఉన్నతాధికారులకు పంపించడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి విచారణకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి శుక్రవారం ఆసుపత్రి చేరుకుని సాయంత్రం 6.30 గంటల వరకూ ప్రాథమిక విచారణ చేశారు. తల్లి బిడ్డల విభాగాన్ని అడు గడుగునా ఆయన పరిశీలించి వివరాలు సేకరించారు. పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఒక మహిళ ఎంసిహెచ్ విభాగంలో ప్రసవం కోసం చేరింది. ఆమెకు సాధారణ ప్రసవమైంది. ఆమె బంధువు లావణ్య నుంచి అక్కడ పనిచేసే ఎఫ్ఎన్‌వో (జీడీఏ) రూ.500 లంచం తీసుకున్నారని వీడియో తీసి పెట్టారు. అంతేకాకుండా అడుగడుగునా అక్కడ సిబ్బంది లంచాలు అడిగిన విధానాన్ని ఆమె వీడియో ద్వారా తెలియజేశారు. ఈ సంఘటనపై విచారణకు కలెక్టర్ తక్షణం ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్ శేషగిరి ఆసుపత్రికి చేరుకుని లావణ్య వాఙ్మూలం నమోదు చేశారు. ఈ నెల 18న పూర్తిస్థాయి విచారణకు ముగ్గురు వైద్యుల బృందంతో కమిటీని ఏర్పాటు చేశారు. అక్కడ ఎవరు ఎంత లంచం తీసుకున్నారనేది విచారణ కమిటీ నిగ్గు తేల్చనుంది. ఈ సందర్భంగా ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు తాను ప్రాథమిక విచారణ జరిపానని ఈనెల 18న పూర్తి స్థాయి విచారణ అనంతరం నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నామని చెప్పారు.

ఆస్పత్రిలో భద్రతా చర్యలు తీసుకుంటాం

మెడికల్ సూపరింటెండెంట్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో భద్రతా చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలిపారు. 'మోటారు సైకిళ్ల మాయం' శీర్షికన ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ స్పందించారు. విధి నిర్వహణలో అలసత్వంపై భద్రతా సిబ్బంది పర్యవేక్షకుని వివరణ తీసుకున్నట్లు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలని సంబంధి త ఏజెన్సీ కాంట్రాక్టర్‌ను హెచ్చరించామని మెడికల్ సూపరింటెండెంట్ ఎంఎస్ రాజు తెలి పారు. సీసీ కెమెరాలు మరమ్మతు చేయించ డానికి, అవసరమైన చోట కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. ఇతరుల వాహనాలు ఆసుపత్రి ఆవరణలో రాకుండా నివారించడానికి అటెండెంట్ పాస్, వాహనాల పాస్ ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్ అనుమతి కోరమని ఆసుపత్రి సహాయ నిర్వాహక అధికారి వారికి ఆదేశాలు జారీ చేసినట్లు డాక్టర్ ఎంఎస్ రాజు వివరించారు.

18 నుంచి వినియోగదారుల వారోత్సవాలు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఈనెల 18 నుంచి 24 వరకూ వినియోగదారుల క్లబ్‌ల సమక్షంలో వినియోగదారుల వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఏలూరు జిల్లా వినియోగదారుల అసోసియేషన్ కన్వీనర్, న్యాయవాది కట్టా సత్యనారాయణ తెలిపారు. ఆర్ఆర్‌పేటలో శుక్రవారం నిర్వహించిన వినియోగదారుల సంఘాల సమావేశంలో నాయకులు మాట్లాడారు. వినియోగదారుల్లో ఉద్యమం బలోపేతం చేయాలని ఆహార పదార్థాల కల్తీ, తూనికలు కొలతల మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి గ్రామం, నగరాల్లోని వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. వినియోగదారుల వారోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 18 నుంచి 24 వరకు స్కూలు విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వినియోగదారుల ఉద్యమనాయకులు, కో కన్వీనర్లు సుబ్రహ్మణ్యం, సీపీఏస్ రామానుజాచార్యులు, బంగార్రాజు, కస్తూరి, వి రామచంద్రమూర్తి, న్యాయవాదులు పి.పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

చెయిన్ స్నాచర్లపై ప్రత్యేక నిఘా

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణంలో కొంతకాలంగా చెయిన్ స్నాచింగ్ సంఘటనలు జరుగుతున్నాయి. అడ్డుకట్ట వేయడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరి మహిళలు లక్ష్యంగా చెయిన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారన్నారు. మహిళలు బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిర్మానుష్య ప్రాంతాల వైపు వెళ్లేటప్పుడు కుటుంబ సభ్యులను వెంట తీసుకువెళ్లాలని సూచించారు. అపరిచిత, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. చెయిన్ స్నాచర్లపై నిఘా పెట్టామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు.

హేకథాన్ విజేతలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



రూ.లక్ష నగదు ప్రోత్సాహకం అందుకున్న విద్యార్థులు

నూజివీడు టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ హేకథాన్‌లో ఆర్జీయుకేటీ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. చత్తీస్‌గడ్‌లోని భిలాయ్‌లో నిర్వహించిన స్మార్ట్ హేకథాన్ వివరాలు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ శుక్రవారం తెలిపారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థుల జట్టు డైనమిక్ రూట్ రేషనలైజేషన్‌పై ప్రాజెక్టును సమర్పించి రూ.లక్ష బహుమతి గెలుచుకున్నారన్నారు. విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏవో బి.లక్ష్మణరావు, డీన్ రత్నాకర్, శ్యామ్ పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాపు

సైబర్ సెక్యూరిటీపై నూజివీడు ట్రిపుల్ ఐటీలో వర్క్‌షాపు నిర్వహించారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అడ్వాన్స్ కంప్యూటింగ్ - హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో ఈవర్క్‌షాపును నిర్వహించారు.

మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు : మంత్రి కొలుసు

నూజివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాదిగల ఆర్థికాభివృద్ధికి రూ.340 కోట్లు కేటాయించిన ఘనత టీడీపీ కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గ మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆత్మీయ కలయిక సమావేశంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో కలిసి ఆయన పాల్గొన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు, దళితుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ద్వారా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా వస్తున్న రిజర్వేషన్లను ఎస్సీల్లోని 59 కులాలు అనుభవించాలనేదే ఎమ్మార్పీఎస్ వాదన అన్నారు. ఒకే వర్గం అనుభవించాలనేది మాలల వాదన అన్నారు. ఎస్సీలలో అన్యాయం జరిగిన వారికే ప్రాధాన్యతనివ్వాలనేదే తమ వాదన అన్నారు.

మ్యాజిక్ బోస్‌కు అమెరికా సంస్థ అవార్డు



బోస్‌ను అభినందిస్తున్న రఘురామకృష్ణరాజు

భీమవరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమెరికా బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు, రచయిత మేజిక్ స్టార్ బోస్‌ను 2024 సంవత్సరానికిగాను 'టాప్ టాలెంట్ ఆఫ్ ది ఇయర్'గా గుర్తించింది. 'ఐకాన్ అవార్డు'ను ఆయనకు ప్రదానం చేసింది. అమెరికా దేశపు 248వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ సంస్థ బోస్‌కు అవార్డును ప్రకటించింది. మెజీషియన్‌గా, రచయితగా 53 ఏళ్లుగా బోస్ చేస్తున్న కృషి, అంకితభావం, పట్టుదల గుర్తించామని పేర్కొంది. అద్వితీయ ప్రతిభతో రికార్డులు నెలకొల్పుతున్న బోస్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డును ఇవ్వడం తమకు గర్వకారణమని ఆ సంస్థ ప్రస్తుతించింది. అవార్డు పొందిన బోస్‌ను డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అభినందించారు. బోస్ నిర్విరామ కృషి, సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత శిఖరాలకు బోస్ చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఏటిగట్టుపై చెత్త.. దారుణం

ప్రజలు ఎలా నివసిస్తున్నారు? కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక బృందం దిగ్ర్భాంతి!



ఏటిగట్టుపై కంపోస్ట్ యార్డు

- కంపోస్ట్‌యార్డుపై నేషనల్ ట్రిబ్యునల్ విచారణ
- ప్రత్యేక బృందం ఏర్పాటు
- రెండు రోజులపాటు పరిశీలన
- నరసాపురంలో గాలి, నీటి నమూనాల సేకరణ



కాలుష్యం పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం

నరసాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏటిగట్టు ప్రాంతంలోని కంపోస్టుయార్డును పరిశీలించిన ప్రత్యేక బృందం దిగ్ర్భాంతి వ్యక్తం చేసింది. ఏటిగట్టుపై కంపోస్ట్ యార్డు దారుణమని, కాలుష్యంతో వ్యాధి కారకమని, పరిసర ప్రాంతాల ప్రజలు ఎలా నివసిస్తున్నారని ఆశ్చర్యపోయింది. నరసాపురం స్మృతివనం వద్ద పురపాలక సంఘం నిర్వహిస్తున్న కంపోస్టుయార్డు ప్రాంతాన్ని చెన్నై కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్ హెచ్‌డీ వరలక్ష్మి నేతృత్వంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కేవీ. రావు, కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీ సభ్యుల ప్రత్యేక బృందం శుక్రవారం పరిశీలించింది. కంపోస్టుయార్డు, పరిసర ప్రాంతాల్లో పొలాలు, నివాసిత ప్రాంతాలు, చెరువులు, పంట కాల్వలను పరిశీలించి స్థానికులతో చర్చించారు. పలు చోట్ల నీటి నమూనాలు సేకరించారు. గాలిలో కాలుష్యాన్ని గుర్తించేందుకు పలు చోట్ల పరికరాలను అమర్చారు. రెండు రోజుల పాటు కాలుష్య శాతాన్ని గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కంపోస్ట్ యార్డుతో కాలుష్య పరిస్థితులను పరిశీ లించారు. కమిటీ రాకను తెలుసుకున్న స్థానికులు కొందరు ఆ ప్రాంతానికి తరలివచ్చారు. తమ సమస్యలను బందానికి నివేదించారు. శనివారం కూడా ఈ బృందం పర్యటించనుంది.

మూడు దశాబ్దాల కంపు

పట్టణంలో 30ఏళ్లుగా కంపోస్టుయార్డును గోదావరి తీరాన్నే నిర్వహిస్తున్నారు. దీనివల్ల నదీ జలాలు కలుషితమై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ఓసూరి దేవేంద్ర ఫణికర్ ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దీనిపై స్పందించిన ట్రిబ్యునల్ చెన్నైలోని కాలుష్య నియంత్రణ మండలి రీజనల్ డైరెక్టర్‌ను విచారించి నివేదికను అందించాలని అదేశించింది. కాలుష్య నియంత్రణ మండలి, కోస్టల్ మేనేజ్‌మెంట్ అథారిటీని కూడా ఈ కమిటీలో నియమించింది. జనవరి 7 నాటికి నివేదికను అందించాలని సంయుక్త కమిటీని ఆదేశిం చారు. ఈ నేపథ్యంలో కమిటీ నరసాపురం ప్రాంతాన్ని సందర్శించింది.

ఎలా భరిస్తున్నారు..

పరిశీలనకు వచ్చిన ఆధికారులు ఏటిగట్టు ప్రాంతంలో కంపోస్టు యార్డును పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు. పరిసర ప్రాంత ప్రజలు ఎలా ఉంటున్నారని దిగ్ర్భాంతి చెందారు. చెత్త ప్రభావంతో తాము కొద్ది సమయంలోనే ఇబ్బంది పడ్డాం.. 30ఏళ్లుగా ఎలా భరిస్తున్నారంటూ ఆందోళన చెందారు. స్థానికులు ఇబ్బందులు తెలియజేయడంతో సమీ పంలో ఉన్న పాఠశాల, కాలేజీని కూడా పరిశీలిం చారు. దగ్గరలోని పంట కాల్వ నీటిని సేకరిం చారు. పడవపై గోదావరిలోకి వెళ్లి నీటి నమూనా సేకరించారు. వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. న్యాయస్థానంకు సంబంధించిన అంశం కావడంతో ఏమి చెప్పలేమని స్పష్టం చేశారు.

ప్రజల కోసమే పోరాటం



కంపోస్టుయార్డుతో ప్రజలు చాల ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు మునిసిపాల్టీ, ప్రభుత్వానికి నివేదించాం. అయినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఢిల్లీలోని ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి కేసు వేశా. కంపోస్టుయార్డు ఇక్కడి నుంచి తరలించే వరకు పోరాటం ఆపను. బాధ్యత గల పౌరుడిగా ప్రజల కోసం ఇదంతా చేస్తున్నా.

\- ఓసూరి ఫణికర్

మృత్యువులోనూ కుమారుడి వెంట తల్లి

- అనారోగ్యంతో కుమారుడి మృతి
- అంత్యక్రియలు చేస్తుండగా తల్లి..
- గార్లమడుగులో విషాదం

పెదవేగి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కుమారుడు మృతి చెందడంతో శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. అంతలోనే వృద్ధాప్యంలో ఉన్న తల్లి మృతి చెందింది. కొద్ది గంటల వ్యవధిలో తల్లీ కుమారుల మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. గార్లమడుగు గ్రామానికి చెందిన చిలమకూరి వెంకట సత్యనారాయణ ఓరియంటల్ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేశారు. నాలుగేళ్ల క్రితం విధులు ముగించుకుని ఏలూరు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. కోలుకున్న అనంతరం ఏలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో చిలమకూరి వెంకట సత్యనారాయణ(60) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందారు. గార్లమడుగులో ఆయన భౌతికకాయానికి శుక్రవారం అంతిమ సంస్కారం ఏర్పాట్లు చేస్తూ శ్మశాన వాటికకు తరలించారు. అంతలోనే ఆయన తల్లి అనసూయమ్మ(80) మృతిచెందినట్లు సమాచారం అక్కడకు సమాచారం వచ్చింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. సత్యనారాయణ తండ్రి వెంకటరత్నం ఓరియంటల్ హైస్కూల్‌లోనే రికార్డు అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు సత్యనారాయణ అక్కడే చదువుకుని, అదే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పనిచేశారు. అకస్మాత్తుగా మృతి చెందడం, ఒకరి వెంట ఒకరుగా తల్లి కుమారులు మృత్యుఒడికి చేరడం బాధాకరమని గ్రామస్తులు అన్నారు. భౌతిక కాయాల వద్ద నివాళులర్పించారు.

17న ఏలూరులో జాబ్‌మేళా

ఏలూరు అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటిఐలో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డీఎల్‌టీసీ అసిస్టెంట్ డైరెక్టర్ రవి తెలిపారు. వివిధ కంపెనీల్లో సుమారు 100 ఉద్యోగాలు భర్తీచేయనున్నారని తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగి 18-35 ఏళ్ల వయసుగల నిరుద్యోగ యువత హాజరుకావచ్చునని సూచించారు. వివరాలకు ఫోన్‌నెంబర్లు 94934 82414, 89196 08183లలో సంప్రదించాలని కోరారు.

కోలుకున్న విద్యార్థులు

ఆసుపత్రి నుంచి డిశ్చార్జి

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఎంపీయుపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతతో, నూజివీడు ఏరియా ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్న 9 మంది విద్యార్థులు శుక్రవారం డిశార్చి అయ్యారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మి శుక్రవారం నూజివీడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థులు ఆసుపత్రి నుంచి నేరుగా స్కూల్‌కు రాగా పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ విజయలక్ష్మి, దుర్గాప్రసాద్ వారికి పరీక్షలు జరిపి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. అంతకు ముందు జిల్లా సర్వేలెన్స్ అధికారి నరేంద్రకృష్ణ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం వంట పాత్రలు, వాటర్ ట్యాంకు, ఆర్‌వో ప్లాంటును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బ్రహ్మాచారి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీ చేశారు. విజిలెన్స్ డీఎస్పీ సింగులూరి వెంకటేశ్వరరావు, విజిలెన్స్ డీఈఈ పి.శ్రీనివాసన్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్స్ శివరామకృష్ణ, డి ప్రసాద్‌కుమార్, ఏజీ వి.శ్రీధర్, ఏఈ పి.శ్రీనివాసరావు, ఎఈఈ ఎం.రూపేష్‌వర్మ, ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు బృందాలుగా తనిఖీలు చేపట్టారు. ఏలూరు నగరంలో తుంపాల ఎరువుల డిపోలో రూ.2.8 లక్షల విలువైన 12.25 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసాన్ని గుర్తించి స్టాక్‌ను సీజ్ చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో నిర్వహిస్తున్న జోషిక ఎంటర్ ప్రైజెస్‌లో రూ.36,93,525 విలువైన 128 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం, రూ. 38,73,326 విలువైన 2,039 లీటర్ల బయో స్టిమ్‌లెస్‌ను గుర్తించి సీజ్ చేశారు. పెనుమంట్ర మండలం వెలగలేరులో గ్రంధి రామలింగేశ్వరరావు కంపెనీలో రూ.6,72,120 విలువైన 30.55 మెట్రిక్ టన్నుల ఎరువులు భౌతిక నిల్వల్లో వ్యత్యాసం ఉండడంతో స్టాక్‌ను సీజ్ చేశారు. ఈ మూడు షాపులపై ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985, సెక్షన్ 6(ఎ) నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసులు నమోదు చేశారు.

క్రైమ్ కార్నర్

ద్విచక్ర వాహనం డిక్కీలో 120 గ్రాముల బంగారం చోరీ

భీమవరం క్రైం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం డిక్కీలో ఉంచిన బంగారాన్ని గుర్తు తెలియని దుండగులు దోచుకున్నారు. టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం శ్రీరామపురానికి చెందిన వాడపల్లి అనూష తల్లితో కలసి చిన అమిరంలోని ఎస్‌బిఐ బ్యాంక్‌కు శుక్రవారం వెళ్లారు. బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టడానికి వెళ్లి బ్యాంక్‌లో రూ.5లక్షలకు సరిపడా బంగారాన్ని పెట్టారు. మిగిలిన 120 గ్రాముల బంగారాన్ని బ్యాగులో ఉంచి ద్విచక్ర వాహనం డిక్కీలో పెట్టారు. పక్కనే జిరాక్స్ కాపీలు తీయించుకుని తిరిగి వచ్చి వాహన డిక్కీ తెరవగా అందులో బ్యాగ్ కనిపించలేదు. బ్యాగ్‌ను ఎవరో గుర్తు తెలియని దుండగులు అపహరించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

పరస్పర దాడులు

ఇరు వర్గాలపై కేసు

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవారిగూడెంలో ఇరువర్గాల వారు పరస్పర దాడులకు దిగారు. ఇరువర్గాల వారు జంగారెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇరుపక్షాలపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. మండలంలోని చిన్నవారిగూడెంలో నైనారపు ఏడుకొండలుకు అదే గ్రామానికి చెందిన పత్తిపాటి వెంకటేశ్వరరావుకు పాత గొడవలున్నాయి. ఈ నెల 4న వెంకటేశ్వరరావు ఇంటికి ఏడుకొండలు వెళ్లి అతడి భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో ఆమె భర్త వెంకటేశ్వరరావు వచ్చాడు. ఏడుకొండలు మళ్లీ వెళ్లి వెంకటేశ్వరరావును కొట్టి గాయపరచాడు. అడ్డొచ్చిన అత్తను కూడా కొట్టి గాయపరిచాడు. గాయపడిన వెంకటేశ్వరరావును 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారి తగాదా గ్రామ పెద్దలలో పరిష్కారం కాకపోవడంతో వెంకటేశ్వరరావు భార్య రమ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. నైనారపు ఏడు కొండలును కొట్టి గాయ పరచిన కేసులో పత్తిపాటి బాలుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పత్తిపాటి బాలు వంటమేస్త్రిని కొడుతుండగా అడ్డు వెళ్ళిన తనను కింద పడవేసి బాలు కర్రతో కొట్టడంతో తలపై తీవ్ర గాయాలయ్యాయని, ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కూడా పెద్దలలో పరిష్కారం కాకపోవడంతో ఏడుకొండలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

- చిత్తపూరు యువతి హైదరాబాద్‌లో మృతి
- భార్యాభర్తల గొడవలే కారణమా?

చాట్రాయి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి నాగలక్ష్మి(29) హైదరాబాద్ మియాపూర్‌లో విషం తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. చిత్తపూరు గ్రామానికి చెందిన మొక్కపాటి శ్రీనివాసరావు కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నారు. లింగపాలెం మండలం తువ్వచిలక గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ మొవ్వ మనోజ్ మణికంఠతో 5 నెలల క్రితం వివాహమైంది. మియాపూర్ గోపాలరావు నగర్ కాలనీలో నివాసం ఉంటున్న దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. దీనితో మనస్తాపం చెందిన నాగలక్ష్మి గత నెల 26న ఆన్‌లైన్‌లో విష పదార్థం తెప్పించుకుంది. ఈ నెల 11న కూడా గొడవ జరగడంతో నాగలక్ష్మి ఎవరూ లేని సమయంలో విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన ఇంటి యజమాని, అతని కుటుంబ సభ్యులు కేపీహెచ్‌బీలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆమె మృతి చెందింది. భర్త వేధింపులు తట్టుకోలేకే తమ కుమార్తె నాగలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని తల్లిదండ్రులు మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తపూరులో విషాదఛాయలు

సామాన్య రైతు మొక్కపాటి శ్రీనివాసరావు పెద్ద కుమార్తె నాగలక్ష్మి హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడడంతో చిత్తపూరులో విషాఛాయలు అలుముకున్నాయి. శ్రీనివాసరావు ముగ్గురు కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు. రెండో కుమార్తెకు కూడా వివాహం కాగా మూడో కుమార్తె అమెరికాలో చదువుతోంది. అందరితో కలివిడిగా ఉండే శ్రీనివాసరావు కుటుంబంలో విషాదంతో బంధువులు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకురానున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదు

బాధితురాలికి రూ.3లక్షల పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశం

ఏలూరు క్రైం/దెందులూరు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల బాలికపై 50 ఏళ్లపైబడిన వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష, ఐదు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని పోక్సో కోర్టు జడ్జి ఉమాసునంద తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం దెందులూరు మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. తండ్రి చెడు వ్యసనాలకు బానిసై పిల్లలను చూడకపోవడంతో నాయనమ్మ వద్ద ఉంటున్నారు. దెందులూరుకు చెందిన నున్నా ఆంతోనీ రాజు (51) చిల్లర కొట్టువద్దకు 2022 అక్టోబర్ 8న బాలిక వెళ్లింది. ఒంటరిగా వచ్చిన బాలికను ఆంతోనిరాజు బలవంతంగా తన ఇంట్లోకి తీసుకువెళ్ళి అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో నాయనమ్మ వెళ్ళి చూసింది. అతడి ఇంట్లో బాలిక ఉండడాన్ని గమనించింది. బాలిక జరిగిన విషయం చెప్పడంతో దెందులూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేశారు. అప్పటి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కె సత్యనారాయణ ఆంతోనిరాజును అరెస్టు చేశారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. నిందితుడు నున్నా ఆంతోనిరాజుపై నేరం రుజువు కావడంతో అతడికి యావజ్జీ కఠిన గారాగార శిక్ష, ఐదు వేల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు అదనంగా శిక్ష అనుభవించాలన్నారు.

బాధితురాలికి మూడు లక్షల రూపాయలు పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని ఉత్తర్వుల్లో న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్‌కు అప్పటి ఎస్ఐ కె.స్వామి, ప్రస్తుతం ఎస్ఐ శివాజీ, కోర్టు కానిస్టేబుళ్ళు శ్రీకాంత్, దిలీప్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఎంవి రమణ, కానిస్టేబుల్ రవికుమార్, ఎఎస్ఐ సిసిలి, ఎఎస్ఐ రుక్మంధనరావు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు. వీరందరిని ఎస్పీ కెపిఎస్ కిశోర్ అభినందించారు.

ప్రేమ పేరుతో బాలికపై వేధింపులు


పోక్సో చట్టం కేసు నమోదు

తణుకు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేటు స్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను ఒక వ్యక్తి ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. తణుకు పట్టణానికి చెందిన తలపాకుల ప్రేమ్‌కుమార్ తరచు బాలిక వెంటపడి ప్రేమించాలని వేధిస్తున్నాడు. అతడి వేధింపులతో భయపడిన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

దొంగనోట్ల ముఠా సభ్యుడి పరార్

పోలీసుల అదుపులో ఉండగానే తప్పించిన అనుచరులు?

భీమవరం క్రైం, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): దొంగనోట్ల ముఠాకు సంబంధించిన వ్యక్తిని పోలీసులు తీసుకువెళుతుండగా అతడి అనుచరులు అడ్డగించి తప్పించడం కలకలం రేపింది. నరసాపురం రూరల్ మండలానికి చెందిన వ్యక్తి డబ్బు నోట్లు ముద్రించి చెలామణీ చేసినట్లు సమాచారం రావడంతో శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లు నర్సాపురం రూరల్ ప్రాంతానికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా రాజమహేంద్రవరం దాటిన తర్వాత నిందితుడి అనుచరులు కొందరు వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి పోలీసులను గెంటివేసి తీసుకువెళ్ళిపోయినట్లు తెలిసింది. వారి ఆచూకీకోసం పోలీసులు టెక్నాలజీ ఆధారంగా పరిశీలించడంతో భీమవరం ప్రాంతంలో ఉన్నట్లు తెలియడంతో భీమవరంలో సోదా చేశారు. శ్రీకాకుళం పోలీసులు, భీమవరం పోలీసులు కలిసి ఈ సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. నిందితుడి ఆచూకీ దొరకలేదని సమాచారం. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.



విగ్రహం, బస్సు మధ్యలో ఇరుక్కున్న కారు

ఇరుక్కున్న కారు..

తాడేపల్లిగూడెం పట్టణంలోని పోలీస్ ఐలాండ్ వద్ద ఆర్టీసీ బస్సు, పక్కనే అంబేడ్కర్ విగ్రహం మధ్య కారు ఇరుక్కుపోయింది. సుమారు 15 నిముషాలు ట్రాఫిక్ నిలిచిపోయింది. పెంటపాడు వైపు నుంచి పోలీస్ ఐలాండ్ వద్దకు కారు వస్తుండగా గమనించని ఆర్టీసీ డ్రైవర్ మలుపు కొట్టడంతో కారు మధ్యలో ఇరుక్కుంది. స్థానికులు కేకలు వేయడంతో బస్సు నిలిపారు. బస్సుకు, అంబేడ్కర్ విగ్రహానికి మధ్య కారు ఇరుక్కోవడంతో కొంత సేపు ట్రాఫిక్ జాం అయింది.

\- తాడేపల్లిగూడెం రూరల్

ఉండి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : రఘురామ


ఆనందపురంలో వాటర్ ట్యాంక్ ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

కాళ్ళ, డిసెంబర్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నానని ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని కోపల్లె, గాంధీనగరం, ఆనందపురం, మాలవానితిప్ప, కలవపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. కోపల్లెలో రూ.12 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్లకు భూమిపూజ, గాంధీనగర్‌లో జలజీవన మిషన్ నిధులు రూ.5.70 లక్షలు, పలువురు దాతలు రూ.11 లక్షల విరాళాలతో నిర్మించిన మంచినీటి ట్యాంక్ ప్రారంభోత్సవం, మాలవానితిప్ప గ్రామంలో జిల్లా పరిషత్ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన వంతెన ప్రారంభోత్సవం, ఎస్సీ బోస్ కాలనీలో దాతల సహకారంతో నిర్మించిన బస్సు షెల్టర్ ప్రారంభోత్సవం, కలవపూడి గ్రామంలో దాతల సహకారంతో రూ. 46 లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. భీమవరం ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు సాగిరాజు సుబ్బరాజు, బూడి నాగమణి, బందా విజయ, గేదెల జాన్, మంతెన శ్రీనివాసరాజు, కంతేటి శ్రీనివాసరాజు, డొక్కు సోమేశ్వరరావు, జనసేన నాయకులు ముత్యాల రత్నం, జుత్తిగ నాగరాజు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, ఏరుబండి రామాంజనేయులు, తోట ఫణిబాబు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లు కొంతకాలం కొనసాగించాలి : జేసీ

భీమవరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బియ్యం, కందిపప్పు, వంటనూనె ప్రత్యేక కౌంటర్లను మరికొంత కాలం కొనసాగించాలని సంబంధిత శాఖ అధికారులను జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జిల్లాలోని వర్తక సంఘాలు, కిరాణా వ్యాపారస్తులతో బియ్యం, కందిపప్పు, వంటనూనె, మినపప్పు, ఉల్లిపాయలు, బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టమాట, ఉల్లిపాయలు ధరలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. నూనె ధర కూడా కొంతవరకు తగ్గిందని నిరారించారు. తణుకు పట్టణంలో ప్రత్యేక కౌంటర్‌లో మినపప్పు హోల్‌సేల్ ధరలకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డీఎస్‌వో ఎం.సరోజ, ఏఎస్‌వో ఎం.రవిశంకర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్‌కుమార్, సీపీవో కంటిపూడి శ్రీనివాసరావు, పి.కళ్యాణ్, కిరాణా వర్తక సంఘాల యజమానులు పాల్గొన్నారు.

గ్యాస్ట్రిక్ సమస్యలపై అవగాహన అవసరం

గణపవరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ట్రిక్ సమస్యలపై నిర్లక్ష్యం చూపకుండా సకాలంలో వైద్యం పొందాలని ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ కృష్ణవర్ధన్ అన్నారు. శుక్రవారం సరిపల్లెలో లయన్స్‌క్లబ్‌లో గణపవరం మండల పీఎంపీల అసోసియేషన్ ఏలూరు ఆశ్రం ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ట్రిక్ సమస్యల నివారణపై ప్రతీఒక్కరు జంక్‌ఫుడ్స్, ధూమపానం, మద్యపానం సేవించడం, నిర్ణీతసమయంలో ఆహారం తిన కపోవడం, ఒత్తిడికి గురవడం తదితర కారణాల వల్లే అధికంగా గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. గ్యాస్ సమస్య పెరిగితే పేగులో పుండ్లు పడి సర్జరీ పడుతుందన్నారు. కార్యక్రమంలో ప్లాస్టిక్ సర్జరీ వైద్య నిపుణురాలు విజయలక్ష్మి, పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి, పరమేశ్వర్లు, మండల కార్యదర్శి శివశ్రీ నివాసరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకరరావు, మండల కోశాధికారి అప్పారావు, శ్రీనివాసరావు. ఆశ్రం ఆసుపత్రి మేనేజర్ జి.సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సీజేఆర్ఎఫ్'తో విద్యుత్ సమస్యల పరిష్కారం


ఫిర్యాదులు స్వీకరిస్తున్న చైర్మన్ సత్యనారాయణ

నరసాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒక్క రూపాయి ఖర్చు కాకుండా విద్యుత్ వినియోగదారులు సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) ద్వారా కరెంట్‌కు సంబంధించిన సమస్యల్ని పరిష్కరించుకోవచ్చని ఈపీడీసీఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్మన్ చైర్మన్ బి.సత్యనారాయణ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వినియోగదారుల సమస్యల్ని పరిష్కరించడమే సీజీఆర్ఎఫ్ ప్రధాన లక్ష్యమన్నారు. ఆన్‌లైన్, ఉత్తరం, వాట్సాప్, ఫోన్ ద్వారా వినియోగదారులు తమ సమస్యల్ని సీజీఆర్ఎఫ్ దృష్టికి తీసుకురావచ్చన్నారు. రెండు లేదా వారం లేదా ఆరు నెలల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కొన్ని కేసుల్లో వినియోగదారులకు నష్టపరిహారం కూడా అందించేలా తీర్పునిచ్చామన్నారు. మరికొన్ని కేసుల్లో అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 8204 కేసులు పరిష్కరించామని, ఇంకా 64 పెండింగ్ ఉన్నాయన్నారు. అనంతరం వినియోగదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కమిటీ చైర్మన్‌ను ఎస్ఈ రఘునాథ్‌బాబు, ఈఈ మధుకుమార్ సత్కరించారు. సభ్యులు షేక్ బాబర్, మసిలా మణి, ఏడీఈ ఓంకాం, ఏఈ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి


పెంటపాడులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

పెంటపాడు/ఆచంట/ఆకివీడు, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : ట్రూఅప్ విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో పెంటపాడు గేటు సెంటర్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు సిరపరపు రంగారావు, బంకూరు నాగేశ్వరరావు , చిర్లా పుల్లారెడ్డి, పోతు శ్రీను మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ చార్జీల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఓ వైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ఇబ్బంది పడుతున్న ప్రజలకు పెరిగిన ట్రూఅప్ చార్జీల పేరుతో బిల్లులు పెను భారంగా మారాయన్నారు. అనంతరం కరెంట్ బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. దూలం ప్రసాద్, దత్తు రాము, గంటకోటి సిద్ధిరెడ్డి, శేషు తదితరులు పాల్గొన్నారు. ఆచంటలో విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆచంటలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్ బిల్లులను దహనం చేశారు. సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఆకివీడు పట్టణంలోని గాంధీజీ సెంటర్‌లో సీపీఎం పట్టణ అధ్యక్షుడు కె.తవిటినాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా కరెంట్ బిల్లులను దహనం చేశారు. పెంకి అప్పారావు, బీవీ వర్మ, బి.కళ్యాణి, గేదెల ధనుష్, గోపిశెట్టి రాంబాబు, షేక్ బాజీ, గేదెల రాము, పంపన రమణ, నెల్లి సూరిబాబు, సత్యనారాయణ, భాస్కరరావు తదితరులు ఉన్నారు.

అమృత్ నిధులతో సుందరంగా దొరగారి చెరువు


ఆక్రమణలు తొలగిస్తున్న నగర పంచాయతీ కమిషనర్ కృష్ణమోహన్

ఆకివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు పట్టణంలో వున్న దొరగారిచెరువు ఇప్పటివరకు అభివృద్ధికి నోచుకోకుండా దుర్గంధ భరితంగా మారింది. ఇటీవల అమృత్ 2.0 నిధులైన రూ.65 లక్షలతో ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాలతో అధికారులు చెరువు చుట్టూ ఉన్న చెత్త, చెరువులో ఉన్న తూడును తొలగించి వాకింగ్ ట్రాక్‌తో పాటు ఆహ్లాదానిచ్చే పచ్చని చెట్లు నాటించారు. చెరువుకు ఎదురుగా ఉన్న ఆక్రమణలు శుక్రవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. మిగిలిన ఆక్రమణలు త్వరలో తొలగిస్తామని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ తెలిపారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో 979 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

భీమవరం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 18 ప్రముఖ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 979 మంది ఫైనలియర్ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ప్లేస్‌మెంట్స్ పొందిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను కళాశాల ఉపాధ్యక్షులు ఎస్వి రంగరాజు మాట్లాడారు. విద్యార్థులను కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు అభినందించారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

ఉండి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన బాలిక ఆచూకీ కోసం తాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలంలో ఓ గ్రామానికి చెందిన పదిహేడేళ్ల బాలిక తాత వద్ద ఉంటోంది. ఈనెల ఏడో తేదీన గ్రామంలో షష్టి ఉత్సవము పురస్కరించుకుని నిర్వహించిన అన్నసమారాధనకు వెళ్లి ఇంటికి వచ్చింది. అనంతరం కుటుంబ సభ్యులు కూడా భోజనం చేసి ఇంటికి వెళ్లే సరికి బాలిక కనిపించకపోవడంతో బంధువులు, తెలిసిన వారికి సమాచారం ఇచ్చిన ఆచూకీ తెలియరాలేదు. శుక్రవారం పోలీసులకు బాలిక తాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

నేడు సాగునీటి సంఘాల ఎన్నికలు

ఏకగ్రీవం చేసేందుకు నేతల ప్రయత్నాలు

నరసాపురం రూరల్/మొగల్తూరు : డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలంలోని నాలుగు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రుస్తుంబాద, వేములదీవి, కొప్పర్రు, నరసాపురం సాగునీటి సంఘాల అధ్యక్షుల ఎంపిక కూటమి పార్టీలకు పెద్ద సమస్యగా మారింది. శుక్రవారం ఉదయం నుంచి పార్టీ కార్యాలయాల వద్ద నేతలు, ఆశావ హుల సందడి కనిపించింది. చాలామంది పదవుల కోసం ప్రయత్నించడంతో వారికి సర్దిచెప్పి ఒప్పించేందుకు నేతలు తంటాలు పడ్డారు. చివరికి వేములదీవి సంఘానికి మాజీ సర్పంచ్ అడ్డాల శ్రీనివాస్, గొంది గ్రామానికి చెందిన పెదపాటి శాంతరాజు నరసాపురం చానల్‌కు, మాజీ మండల ఉపాధ్యక్షుడు అందే రామకృష్ణకు రుస్తుంబాద చానల్స్ అధ్యక్షుడిగా దాదాపు పేర్లు ఖరార య్యాయి. కొప్పర్రు ఛానల్‌కు పోటీ ఉంటుందని అంతా భావించారు. ఈ పదవిని ఇద్దరు ఆశించడంతో మరోసారి నేతలిద్దరిని కూర్చోబెట్టి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శనివారం జరిగే ఎన్నికల్లో పోటీ లేకుండా అన్ని సంఘాలను ఏకగ్రీవం చేయాలని నేతలు పట్టుదలతో ఉన్నట్టు సమాచారం. మొగల్తూరు మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, మచ్చగడ, కాళీపట్నం సాగునీటి సంఘాలు ఉన్నాయి. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ సమక్షంలో జనసేన, తెలుగుదేశం, బీజేపీ నాయకులు సమన్వయ కమిటి సమావేశం నిర్వహించి సాగునీటి సంఘాలకు చైర్మన్, వైస్ చైర్మన్, డెరెక్టర్ పదవులకు ఏకాభిప్రాయానికి కృషి చేశారని తెలిసింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సాగునీటి సంఘాల ఎన్నిక లాంఛనంగా మారనుంది.

- పెనుమంట్ర : పెనుమంట్ర మండలంలో ఐదు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తు న్నా మని మండల తహసీల్దార్ వై.రవికుమార్ తెలి పారు. మల్లిపూడి, జుత్తిగ, పెనుమంట్ర, పొల మూరు, ఆలమూరు నీటి సంఘాలకు శనివారం ఉదయం ఎన్నికలు నిర్వహిస్తామని ఆసక్తి గల రైతులు ఆయా నీటి వినియోగదారుల సంఘం ఓటరు జాబితాలో ఓటున్నవారే అర్హులన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలంలోని ఆరుగొలను-2, కొత్తూరు. దండగర్ర, పెదతాడేపల్లి, కుంచనపల్లి, వీఆర్‌గూడెం, జగన్నాథపురం-3, మాధవరం, కొండ్రుప్రోలు, అప్పారావుపేట గ్రామాల నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ శనివారం తెలిపారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

జిల్లా వ్యాప్తంగా వున్న 20 మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యల్ని పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను ఆయా తహసీల్దార్లు శుక్రవారం ప్రారంభించి వినతులు స్వీకరించారు.


కొత్తపాలెంలో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్, దొడ్డిపట్లలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసి రాజు

కాళ్ళ/ఉండి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, భీమవరం డివిజన్ ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి సూచించారు. కాళ్ళ గ్రామంలో ముఖ్యఅతిథులుగా వారిద్దరూ విచ్చేసి రెవెన్యూ సదస్సును ప్రారంభించారు. తహసీల్దార్ జి.సుందర్‌సింగ్ ఆధ్వర్యంలో 13 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ సందర్భంగా కౌలు రైతుకు ఎమ్మెల్యే, ఆర్డీవో చేతుల మీదుగా కార్డు అందజేశారు. గ్రామ సర్పంచ్ బందా విజయ, అధికారులు పాల్గొన్నారు. ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారంలో ఇన్‌చార్జి తహసీల్దారు రత్నకుమార్ ఆధ్వర్యంలో నాలుగు దరఖాస్తులు అందాయన్నారు.

- యలమంచిలి : యలమంచిలి మండలం దొడ్డిపట్ల గ్రామంలో తహసీల్దార్ జి.పవన్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరసాపురం ఆర్డీవో దాసి రాజు మాట్లాడుతూ భూసమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. 17 మంది రైతులు పట్టాదారు పాస్‌బుక్ కోసం దరఖాస్తులు అందించారు.
- నరసాపురం రూరల్/మొగల్తూరు : నరసాపురం మండలంలో తహసీల్దార్ రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో కొత్త, పాత నవరసపురం గ్రామాల్లో వినతులు స్వీకరించారు. సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు. మొగల్తూరు మండలంలోని కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాల్లో తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్ ఆధ్వర్యంలో 46 ఫిర్యాదులు స్వీకరించారు.
- చంట/పెనుగొండ/పోడూరు/పెనుమంట్ర : ఆచంట మండలం పెదమల్లం గ్రామంలో తహసీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో పలువురు రైతులు అర్జీలు అందించారు. పెనుగొండ మండలం దొంగరావిపాలెం, చినమల్లం గ్రామాల్లో తహసీల్దార్ జి. అనితకుమారి ఆధ్వర్యంలో, పోడూరు మండలం పెనుమదం గ్రామంలో టీడీపీ రైతు కమిటీ జిల్లా కార్యదర్శి రాచకొండ విశ్వనాథం నేతృత్వంలో తహసీల్దార్ మహ్మద్ సయ్యద్ ఫాజిల్ ఆధ్వర్యంలో, పెనుమంట్ర మండలం నెగ్గిపూడిలో టీడీపీ సీనియర్ నేత వెలగల మల్లికార్జున్ రెడ్డి నేతృత్వంలో తహసీల్దార్ వై.రవికుమార్ ఆధ్వర్యంలో ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయన్నారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో రైతుల నుంచి భూ సమస్యలు, పాస్ బుక్ సమస్యలు, రీ సర్వే తదితర అంశాలపై ఫిర్యాదులు స్వీకరించారు. సర్పంచ్ బేతపూడి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- అత్తిలి : అత్తిలి మండలం పాలి, కేఎస్ గట్టు గ్రామాల్లో తహసీల్దార్ దశిక వంశీ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకులు బుద్దాల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి డాక్టర్ తీగల రమేష్ రాక

పెంటపాడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈనెల 15న విజయవాడ నుంచి న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్ వస్తున్నారని ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. తల, మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించిన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కొవ్వలి నాయుడు రాక

నరసాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు శనివారం అమెరికా నుంచి నరసాపురానికి వస్తున్నారు. నెలాఖరు వరకు ఆయన నరసాపురంలోనే ఉంటారు. సభ్యత్వ నమోదు, పార్టీ కార్యక్రమాల్లో ఆయన పాల్గొనున్నారు. ఇదే సమయంలో పార్టీ అధినేత చంద్రబాబు నాయుడినా కలవనున్నట్లు తెలిపారు.

ధ్యానంతో ఏకాగ్రత, క్రమశిక్షణ

తణుకు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ధ్యానంతో విద్యార్థులకు ఏకాగ్రత, క్రమశిక్షణ, సమయ పాలన, ధైర్యం వంటి వాటిపై పట్టు సాధించవచ్చని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయ్ తెలిపారు. శుక్రవారం కళాశాలలో స్టూడెంట్ యూనియన్, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ సంయుక్తంగా పెయింటింగ్ కార్యక్రమం నిర్వహించారు. విశిష్ట మహిళా అవార్డు గ్రహీత ఎ.శ్రీలత విద్యార్థినులకు ఉచితంగా హేండ్ ఫ్యాబ్రిక్ పెయింటింగ్, 3డి క్విల్లింగ్ మెలకువలపై శిక్షణ అందించారు. హార్ట్‌ఫుల్ నెస్ శిక్షకులు బి.గాయత్రి పది రోజులుగా శిక్షణ అందిస్తున్నారు.

15న సమావేశం జయప్రదం చేయాలి

ఆకివీడు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణకార సంఘం విస్తృత కార్యవర్గ సమావేశం ఈనెల 15న నరసాపురం టీటీడీ కల్యాణ మండపంలో జయప్రదం చేయాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. స్వర్ణకార వృత్తిదారులను కార్పోరేషన్ డైరక్టర్లుగా, విశ్వబ్రాహ్మణులను దేవాలయాల డైరక్టర్లుగా నియమించాలని సమావేశంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం


డీఆర్వో వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందిస్తున్న వైసీపీ నాయకులు

భీమవరంటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. అన్నదాతకు అండగా వైసీపీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. తొలుత విస్సాకోడేరువంతెన దగ్గరనుంచి నాయకులు ప్రదర్శనగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ అంటూ ప్రచార ఆర్భాటం చేసిన కూటమి అందులో భాగంగా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20 వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని చెప్పి నేటికీ సహాయం అందించలేదన్నారు. ఉచిత బీమా పథకాన్ని ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, గూడూరు ఉమాబాల, వేండ్ర వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి, ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహారాజు మాట్లాడారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందించారు. వైసీపీ నాయకులు గాదిరాజు రామరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, ఏఎంసీ ఏఎస్ రాజు, చెల్లెం ఆనంద ప్రకాష్, యడ్ల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధికి పనిచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్/అత్తిలి/పాలకొల్లు అర్బన్/పెనుగొండ/మొగల్తూరు/గణపవరం/తణుకు/ ఉండి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కట్టుబడి పనిచేయాలని ఎంపీపీ పి.శేషులత సూచించారు. తాడేపల్లిగూడెం మండల సమాఖ్య భవనం వద్ద సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పరిపాలన అంశంపై ఎంపీడీవో ఎం.విశ్వనాథ శర్మ వివరించారు. అత్తిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తాడేపల్లిగూడెం డీఎల్‌డీవో ఆఫీస్ ఏఓటీ శేషగిరి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, సచివాలయ కార్యదర్శుల శిక్షణ తరగతులు పూర్తి చేశారు. ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. పెనుగొండ మండలం పెనుగొండ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో, మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి ఆధ్వర్యంలో, గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బేబీశ్రీలక్ష్మి అధ్యక్షతన, తణుకు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆర్.లోహిత్‌జయసాగర్ ఆధ్వర్యంలో, ఉండి మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీంద్ర ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఆయా కార్యక్రమాల్లో భాగంగా రెండురోజుల పాటు శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆధ్యాత్మికం

దాసాంజనేయ స్వామికి పూజలు


భీమవరంలో దాసాంజనేయ స్వామికి ఎమ్మెల్యే అంజిబాబు పూజలు.. స్వామిని దర్శించుకుంటున్న బాబ్జి

భీమవరంటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరంలోని మారుతీ టాకీస్ సెంటర్‌లోని దాసాంజనేయ స్వామి 44వ శ్రీహనుమద్వ్రత సప్తరాత్ర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారి గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు ప్రారంభించారు. ఈవో గొట్టుముక్కల నాగసీతారామరాజు మాట్లాడుతూ ఏడు రోజులపాటు స్వామికి 1,116 కొబ్బరికాయలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, 1500 అరటి పండ్లు, లక్ష తమలపాకులు, పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేస్తామని, 21న అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, కారుమూరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- భీమవరం 16వ వార్డు రైతు బజార్ వెనుక వున్న దాసాంజనేయ స్వామి హనుమద్వ్రత మహోత్సవం ప్రారంభమైంది. ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పంచామృతాలతోను, పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. 16వ తేదీన అన్నసమారాధన నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. గునుపూడిలోని సోమేశ్వరస్వామి ఆలయంలోని ఉప ఆలయంగా ఉన్న దాసాంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు.
- అత్తిలి : అత్తిలి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమద్ వ్రతం సందర్భంగా స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వ హించారు.
- పాలకొల్లు అర్బన్ :యడ్ల బజారులోని పంచముఖాంజనేయస్వామి ఆలయంలో భక్తుల గోత్రనామాలతో సహస్రనామార్చనలు నిర్వహించారు.
- పెనుగొండ : పెనుగొండలోని నగరేశ్వర మహిషాసుర మర్దిని వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో హనుమాన్ స్వాములతో హనుమత్ వ్రతం నిర్వహించారు.
- పెంటపాడు: తాళ్ళ ముదునూరుపాడులోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ వ్రతాలు నిర్వహించారు. పెంటపాడు మండలం ఉమామహేశ్వరంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమరాధన నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి స్వామిని దర్శించుకున్నారు.
- పాలకొల్లు అర్బన్: పాలకొల్లు 12వ వార్డులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం షష్ఠి ఉత్సవాల ముగింపులో భాగంగా సుమారు పది వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గుణ్ణం విశ్వేశ్వరరావు, తదితరులు సేవలు అందించారు.
- ఉండి : ఉండి శివాలయం ప్రాంగణంలోని గీతామందిరంలో స్త్రీలచే లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. శుక్రవారం ఉండి రాజులపేటలో వున్న శివాలయంలో 64వ గీతాజయంతి ఉత్సవాలలో భాగంగా గీతా ఉపన్యాసములు భగవద్గీత శ్లోకాల కార్యక్రమాలు నిర్వహించారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : తాడేపల్లిగూడెం పట్టణంలోని కనకమహాలక్ష్మి 33వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి, జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్, ఈతకోట తాతాజీ, పెంటపాడు ఆర్వో నరిసే సోమేశ్వరరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సీఐ

నరసాపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని రూరల్ సీఐ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం లక్ష్మణేశ్వరంలోని ఆక్వా యూనివర్సిటీ కాలేజీలో మాదక ద్రవ్యాలు, ర్యాగింగ్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ నీరజ మాట్లాడూతూ తల్లిదండ్రులు పిల్లలపై పెట్టుకున్న కలల్ని నెరవేర్చాలన్నారు. ఎస్ఐ సురేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్.వీరభద్రరావు, శ్రావణి పాల్గొన్నారు.

కొత్త డిజైన్లపై మహిళలు ఆసక్తి పెంచుకోవాలి

నరసాపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు మార్కెట్‌లో వస్తున్న కొత్తకొత్త డిజైన్లపై ఆసక్తి పెంచుకోవాలని ఈపీసీహెచ్ ఇండియా దక్షిణాధిరాష్ట్రాల సంచాలకులు కలవకొలను తులసీ అన్నారు. శుక్రవారం ట్రేడ్ సెంటర్‌లో శిక్షణ పూర్తిచేసిన 30 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఆన్‌లైన్ మార్కెటింగ్, ఎగ్జిబిషన్‌లలో పాల్గొని ఆర్డర్లు తెచ్చుకుని మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. రవీంద్రగౌతమ్, సుగుణరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

తణుకు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, పెరవలి రోడ్డు ప్రాంతంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. వారంలో ఒకసారి డ్రైడే పాటించడం వల్ల దోమకాటు వ్యాధులకు చెక్ పెట్టవచ్చన్నారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


శివప్రసాద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ప్రశ్న నుంచే పరిశోధన

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి మదిలో మొదలయ్యే ప్రశ్నను ఛేదిస్తే పరిశోధన మొదలవుతుందని ఇస్రో మాజీ శాస్త్రవేత్త శివప్రసాద్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయ ఆవరణలో శుక్రవారం భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'రాకెట్ సైన్స్' అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌ను ప్రిన్సిపాల్ టి.అశోక్ తదితరులు సత్కరించారు.

సమస్యలపై దృష్టి పెట్టండి

తాడేపల్లిగూడెం రూరల్ డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టిపెట్టాలని ఎంపీపీ పి.శేషులత పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా గత సర్వ సభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో ఎం. విశ్వనాథ్, తహసీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఏడీఏ పి.మురళీకృష్ణ, సోషల్ వెల్ఫేర్ అధికారి రామాంజనేయులు తమ శాఖలకు సంబంధించిన వివరాలు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

పాలకొల్లు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఏపీయూడబ్ల్యూజే అనుబంధ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు కొద్దిసేపు ఆందోళన చేశారు. శుక్రవారం సాయంత్రం తహసీల్దార్ వై.దుర్గాకిషోర్‌కు వినతి పత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విన్నకోట వెంకటరమణ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గం వేములపల్లి మండల కేంద్రంలో తాగునీటి సంఘాల ఎన్నికలను కవర్ చేయడానికి వెళ్ళిన జర్నలిస్టులు, వీడియోగ్రాఫర్లపై దాడిచేయడం దారుణమన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌వీ సాంబశివరావు, కోశాధికారి తోట రాంబాబు, ఉపాధ్యక్షుడు గోపరాజు గోపి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

యలమంచిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యలమంచిలికి చెందిన ఎన్ఆర్ఐ తాళ్లూరి సీతాదేవి తన తండ్రి పేరున తాళ్లూరి వెంకటనారాయణ ఎడ్యుకేషనల్ స్కాలర్‌షిప్ పేరిట ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిఏటా నగదు ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. దీనిలో భాగంగా యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించిన అనంతరం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో 65 శాతం సాధించిన బర్రె ప్రమీల, 78.8 శాతం సాధించిన శనగళ్ల రజని, బి.ఫార్మసీలో 72శాతం ఉత్తీర్ణత సాధించిన తిరుమాని బిందుమాలినిలకు కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.25,000 చెక్కులను ప్రిన్సిపాల్ నాగజ్యోతి అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ సీతాదేవి విద్యార్థులకు తోడ్పాటును అందించడం స్ఫూర్తిదాయకమన్నారు.